

జ్ఞానోదయ గ్రంథమా[illegible] — 7

మ[illegible]షా స న[illegible]

కొణకంచి చక్రధరరావు గారిచే

వ్రాయఁబడినది.

సేతు ముద్రాక్షరశాల,

మచిలీపట్టణము.

1912

వెల. రెండణాలు.

భవిష్యద్భారతసంతానమునం దగ్రగణ్యుం డయ్యెడు నని
తదీయసుగుణాంకురములం గాంచి యోచించిన
మా యోచనలకు వ్యతిరేకముగ బాలప్రా
యమునందే ప్రపంచమును విడనాడిన
శ్రీ పింగలి వెంకటమన్ మోహన్‌రెడ్డి
గారి సౌలక్షణముల యొక్క జ్ఞాప
కార్థముగ నీ పుస్తకమును వారి
పేర నంకిత మొనర్చు
చున్నాడను.

శ్రీ.

ఇట్లు,
చక్రధరరావు.

విజ్ఞాపనము.

కొంతకాలము క్రిందట, సహీఫా, జమానా, యను మాసపత్రికలయందీ మయూరాసనమును గూర్చి కొంత వివరముగ వ్రాయఁబడిన చారిత్రిక విషయములను జూచి, వాని నొకవ్యాసరూపమున మన యాంధ్రపత్రికలలో నెద్దానియందైనఁ బ్రకటింపఁదలఁచి తీరిక కలిగినప్పు డెల్లను గొంచెముగ వ్రాయుచుఁ గొన్ని దినములకు పూర్తి జేసితిని గాని పూర్తియైన పిదప నామిత్రులును, మాకార్యస్థానమున శిరస్తాదారులును నగు మ.రా. బ్రహ్మాండం నృసింహారావుగారు "సశేషముగఁ బత్రికలలోఁ బ్రకటితమగుటకంటెఁ గొంచెము విపులముగనున్న వ్యాసము గాన నొక చిన్నిపుస్తకరూపమున నుండుట యుక్త" మను నభిప్రాయ మిచ్చుటచే నట్లే యొనరించితిని. ఇందలి లోపములను క్షమించుటకు భాషావిదులగు పెద్దలు ప్రార్థితులు.

వడ్డేపల్లి,
ఆబ్కారీ ఆఫీసు.
22-4-12.

ఇట్లు విధేయుఁడు,
కొణకంచి చక్రధరరావు.

మయూరాసనము.

"తఖ్తు" యనునది పారసీభాష యందు కూర్చొనుట కుపయోగింపఁబడు "కుర్చీ" యనుపదమునకు సమానార్థక మగు వాక్యము; గాని యే యేస్వరూపలక్షణములను గలిగియున్న యాసనము 'తఖ్తు' అనుపదమునకు లక్ష్యముగఁ జూడఁ బడు చున్నదో యాస్వరూపలక్షణములు 'కుర్చీ' యని వాడఁబడు నాసనమునకు లే కుండుటచే నిప్పుడు కూర్చుండుభాగ మెటుఁ జూచినను సమానములగు పొడవు వెడల్పులును, నాలుగుకాళ్లును గలిగి దాదాపు ఖట్వారూపమును బోలినదిగ నున్నదానినే 'తఖ్తు' అని పిలుచు చున్నారు.

ఇది సర్వసాధారణముగ నందఱుచే వాడఁబడు చున్న "తఖ్తు" అనుపదముయొక్క వివరణము; కాని యీశబ్దముయొక్క ప్రత్యేకార్థము రాచకార్యములను నిర్వర్తించుటకై యొకరాజ్యమును బాలించెడి రాజుచే నధిష్ఠింపఁ బడి యుండెడి యాసనముపట్ల వర్తించు చున్నది. ఈరాజాధిష్ఠిత మగు తఖ్తు యొక్క రూపలక్షణములు గూడ దాదాపుగఁ బైనఁ జెప్పఁ బడిన తఖ్తునే పోలి యుండును గాని యిది సామాన్యము లగు తఖ్తులకంటె మిక్కిలి యలంకారయుతముగను బరిమాణమునందు కొంచెము తక్కువగను నుండి యానుకొనుటకను వగు నట్లు వెనుకను తట్టుక "తకియా" (దిం

డు) లనును పైభాగమున నీడ నిచ్చుచున్నదానివలె నగుపడుచు శిల్పకళా చాతుర్యయుతమును, మూల్యవంతమును నై మెరయుచుండెడి యొక ఛత్రి మును గలిగి యుండును.

ఈ తఖ్తు రాజచిహ్నములలో మిక్కిలి యావశ్యకమైనదిగఁ బరిగణింపఁబడుచున్నది. దీనికి పీఠారోహణ మను పేరటి మహోత్సవ మొకటి సంబంధించి యుండును. ఏకార్యానుష్ఠానానంతరము రాజు తాజొక స్వాతంత్ర్యపదవి నంది నిజాధికారమును యథావిధిగ నెరవేర్పశక్తి గలవాఁడగునో యదియే యీమహోత్సవము. పీఠాధిరోహణము ననుసరించి దానికి తుల్యమగు యావశ్యముగ భావించెడి మఱియొక కర్మ గూడ గలదు. దీనికి కిరీటధారణోత్సవ మనియును లేక మకుటధారణోత్సవ మనియును జెప్పెదరు. ఈ రెంటికిని బ్రథమము నుండియుఁ బరస్పరసంబంధము గలిగి యుండుటచే వీనిలో నేపదమును జెప్పినను నాశబ్దమునం దీకార్యములు రెండును నిమిడియున్నట్లు సాధారణముగ భావింపఁబడుచుండును గాని యిచ్చట కిరీటమును గుఱించివర్ణించుట మా యీ వ్యాసము యొక్క యుద్దేశము గాదు కావున దానిని గుఱించి యిఁక నింతకంటె నధికముగ వ్రాయక తఖ్తుయొక్క యుత్పత్తికి సంబంధించిన కొన్ని చారిత్రికవిషయములను మాత్రము వివరించి యాపిమ్మట ముఖ్యవిషయమునకు మరలెదము.

తఖ్తు యొక్క యారంభము 'జమ్షీదు' అను రాజునుండి పుట్టినదనియును, నతని కిదియేగాక మఱికొన్ని నూతననిర్మాణములును గావించినగౌరవముగూడ కల దనియును, నాయన తన తఖ్తును వివిధములును బహుమూల్యవంతములును నగు రత్నసంచయములచే మిగుల సుందరముగ నలంకరించి జ్యోతిష్కులయభిప్రాయముతో నొక శుభలగ్న మేర్పాటు గావించుకొని యాసమయమునం దాగద్దియ నధిష్ఠించె ననియును, మఱియు నామహోత్సవంతో సమాచారముగ నొక గొప్పయుత్సవ మొనరించె ననియును

"మాజాసుల్తానీ" యనుచారిత్రమునందు వ్రాయఁబడియున్నది. కాలవిపర్యయమును దానిచేఁ బారశీకరాజ్యపీఠము జమ్షీదునుండి లాగుకొనఁబడినయనంతరము దానిపయి మఱికొందఱు రాజు లధిష్ఠించి ప్రభుత్వ మొనరించుచున్నపుడు వారు నయితము జమ్షీదు యొక్క యీనూతనరచనను మిక్కిలి గౌరవదృష్టితోఁ జూచిరి. సామాన్యముగ నీప్రపంచమునం దొకానొక బుద్ధిమంతుఁ డేదేని యొకపదార్థము నుత్పత్తి చేసి పోవగనే యాతనికి పిమ్మట నాపదార్థమునం దొక కొన్నిమార్పు లగుచుండుట లోకధర్మముగ నున్నది. కావున నిట్లే జమ్షీదుచే నిర్మాణము గావింపఁ బడిన తఖ్తు యందుఁ గూడ "ఫరీదూన్" యను విశాలకీర్తియుతుఁ డగు నొక పారశీకపురాజు కొన్ని యావశ్యకము లగు సవరణలు గావించి దానిని మిగుల సౌందర్యయుతముగఁ జేయుటే గాక యష్టకోణాకృతిగఁ గావించి యమూల్యము లగు రత్నములతోడను వెండిబంగారులతోడను బలువిధములఁ జిత్రించి దాదాపుగ నిదియు నొక నూతనకల్పనమే యని భావింపఁ బడఁ దగి నట్లుగ మార్చివైచెను. ఈఫరీదూన్ యొక్క తఖ్తును గుఱించి యనేకు లనేకవిధముల వర్ణించియున్నారు, గాని మేము వాని నన్నిటిని వదలి దాని మూల్యక్రమము నించుమించుగాఁ దెలుసుకొనుట కై యాతఖ్తుచుట్టు వేయిబంగారపుగుండ్లు బంతులవలె వ్రేలాడుచుండె ననియును, వానిలోఁ బ్రతి బంతియు నైదువందల ముష్కము లనఁగా రెండువందల తులముల తూనికె కలిగి యుండె ననియును మాత్రము చెప్పినఁ జాలు నని తలంచెదము.

ఈ ఫరీదూన్ తఖ్తు యొక్క ప్రతిబింబమును దృష్టిపథమునం దిడుకొని చూచుచున్న మనహృదయముల కొక "ప్రాచీనకాలముననే గాక ప్రస్తుతకాలమునఁ గూడ నిట్టి యతివిచిత్రమును, నమూల్యమును నగు తఖ్తుకు సరి బోల్చి చెప్పం దగు నట్టి తఖ్తు మఱియొకటి లేకుండె నోపు" నని తోఁచవచ్చును. గాని తోడనే మనవిజ్ఞానభావము దేని ప్రతిబింబవీక్షణముచే

నీ ఫరీదూన్ తఖ్తు యందలి గౌరవోద్దేశ మంతయు నిరసనపై "ఇది (మయూరాసనము) "ఫరీదూన్" తఖ్తు కేవిషయమునైనను దీసిపోవంజాల" దని తక్షణమే చెప్ప సాహసించెదమో యట్టి మయూరాసనము యొక్క మనోహారస్వరూపమును మనవ్యాచ్ఛత్తువుల కెదురుగఁ దెచ్చి నివేదించుచున్నది. ఈ తఖ్తుతావుస్ (మయూరాసనము) ఏమహామహుని యద్వితీయనిర్మాణ చాతురీగరిమకు భూలోకమందలి యద్భుతరచనలలోని కెల్ల నాయకమణిగాఁ జేరొక్కనంబడుచున్న తాజ్‌మహల్ ప్రబలసాక్ష్యముగ నున్నదో యట్టి మొగలురాజవంశోత్పన్నుఁడును, భరతఖండసామ్రాజ్యమునకు సార్వభౌముండును నగు షాహాజహానుచక్రవర్తిచేఁ జేయింపఁబడినది గాన నిది ఫరీదూన్ తఖ్తుకంటెను మించియున్నదని చెప్పుటకు మనకేయభ్యంతరము నుండఁజాలదు. వాస్తవముగ విచారించి చూచినచో షాహాజహాను చక్రవర్తి పారసీకసార్వభౌముల మహదైశ్వర్య మీభరతఖండపట్టభద్రుని మహాభాగ్యమునందొక లెక్కలోనిదిగాఁ బను యంశమును సప్రమాణముగ లోకమునఁ జాటుటకై వేనిఁ గాంచి నేటికిని ప్రపంచమబ్బురపడుచున్నదో యట్టియద్వితీయములును, నపూర్వములునునగు స్మారకచిహ్నములను స్థాపించి కీర్తిశేషుఁడయ్యెనని స్ఫురింపక మానదు. ఇందులకు తార్కాణముగ 'తఖ్తుతావుస్'(మయూరాసనము) గూడ షాహాజహానుయొక్క మహద్వైభవములయందొకటియై యున్నది. చెప్పుటకుమాత్ర మిది యొకయాసనమే గాని దీనియం దెంతటి కళాకౌశల్యమిమిడియున్నదో మఱియు నిది యెంతటి సౌందర్యస్వరూపమును గలిగియున్నదో యావివరము నొక్కింత సంగ్రహముగ మాచదువరులు క్రింది వివరణము వలనఁ దెలిసికొనియెదరు గాక.

షాహాజహానుచక్రవర్తి స్వాభావికముగ విభవాభిలాషి. ఇందువలననే తండ్రిస్థానమున కెక్కించినవిమ్మట నాతనికి షాహాజహాన్ (భూలోకప్రభువు)

యును తన నామము పెట్టు తత్పూర్వ రాజన్య నామములకంటె నెక్కుడు గౌరవ సమన్విత మై యున్నదో యట్లే తన కొలువుకూటము (దర్బారు) కూడ యనన్యసాదృశ్య మై వారల యాస్థానమునకంటె వేయిమడుంగు లధిక మగు శోభాసమేత మై విరాజిల్లు చుండు నట్లు చేయవలయు నను నొక యభిప్రాయ ముదయించెను. ఈ యభిప్రాయమె యమూల్యరత్నసంచయస్థాపితము చేఁ గేవల మొకమూల్యమునందే గాక పనితనమునందు కూడ నిట్టి దింకొకటి లేదని స్వభావోక్తిగఁ జెప్పఁ దగినట్టి గద్దియనొక దానిని నిర్మింపఁ జేయ వలయు ననుకోరిక యాతని హృదయమునందు స్థిరముగఁ బాదుకొనుటకు ప్రబలకారణ మయ్యెను.

ఈకోర్కెను బూర్తిపఱచుట కాతఁడు రాచనగళ్లలోని ప్రత్యేక ధనాగారముల నుండియే గాక సాధ్య మయినంత వఱకు వెలుపల నుండు రత్నసంచయములను గూడ దెచ్చి కనుపఱచ వలయు నని రత్నశాలాధ్యక్షుండగు 'బేబదల్ ఖాన్' అనునధికారికి యుత్తరు వొసంగెను. ప్రభు వాజ్ఞ యయిన పిమ్మట దర్బారులోనికి తేబడిన నానావిధము లగు రత్నములచే నొక్క పెట్టున నాకొలువు కూట మంతయు దేదీప్యమాన మై వెలుంగుచు వానిలో నుండి వెడలు చున్న కిరణములు జూచువారల కన్నులకు మిరుమిట్లు గొలుపుచుండెను. తేఁబడిన రత్నము లన్నియు నమూల్యము లై యనుపమానము లై యున్నను వానిలో నుండి గూడ మన షాహాజహాను చక్రవర్తి ముఖ్యమయినవియు మనోహరము లయినవియు నగురత్నముల నేరెను. అట్లేరినరత్నము లేబదివేలముప్పది యను లనఁగా రెండు వేలతులముల తూనికగలవిగ నుండెను. వీని మొత్తపు మూల్యము రెండుకోట్లరూపాయ లుండు నని "జవాన్ కుషాయె నాదరి" యను గ్రంథమున వ్రాయఁబడి యున్నది. ఈరత్నము లన్నిటిని బేబదల్ ఖానున కిచ్చి యొకలక్ష తులముల మేలిమి బంగారముతోఁ గలిపి గద్దియను నిర్మింప వలయు నని యాజ్ఞాపించి దాని

నిర్మాణమును గూర్చి యొకపటమును వ్రాసి యది యుండవలసిన తెరంగును, వెడల్పును బొడవును నింక నిట్టివియే యగు మఱికొన్ని యితరాంశములను నొక సంపూర్ణకళాకౌశలుం డగు యుపాధ్యాయుఁడు నేర్పినట్లు బెబదల్ ఖానునకు బోధించెను.

హిందూస్థానమును దర్శించుట కేతెంచిన సుప్రసిద్ధయాత్రికుం డగు 'డాక్టర్ బర్నియర్' అను నాతండు దీని మూల్యమును గుఱించి రమారమి నాలుగు కోట్ల రూప్యముల కెంతమాత్రమును దక్కువగ నుండఁ జాల దని చెప్పుచు నీవిధముగ నాద్యంతము వెండి బంగారులతో యమూల్యము లగు రత్నములను స్థాపించి మఱియొక పీఠమును సిద్ధపరుప వలెనన్న నింతకంటె తక్కువద్రవ్యముతో నెప్పటికిని బూర్తి కాఁ జాలదని వ్రాసెను. పాదుషాహానామ (రాజచరితావళి) యను చారిత్రకగ్రంథమును వ్రాసిన ముల్లాఅబ్దుల్ మజీదు అనునాతఁ డీపీఠము యొక్క మూల్యము మూఁడుకోట్ల రూప్యములని తెలిపెను. కొందఱు చారిత్రకారులు దీనిమూల్య మొక కోటిరూప్యములని వ్రాయుటతోఁ దృప్తిఁ జెందిరి; గాని ఈతఖ్తునం దమిడించఁబడిన రత్నములను షాహజహానుయొక్క గౌరవవైభవభాగ్యముల నూహించి చూచినచో నొక కోటిరూప్యముల మూల్య మని చెప్పిన చారిత్రకారుల వ్రాతలు సత్యము లని మన మెప్పుడును విశ్వసింపఁ జాలము. తనకాలమున నొక సుప్రసిద్ధరత్నపరీక్షకుం డని పేరొందిన ట్యూవెనియ రను పేరుగల ఫ్రాంసుదేశపు రత్నవర్తకుఁ డొకఁ డీపీఠమును బహుదినములదనుక పరీక్షించి దాని మూల్యము నారుకోట్ల యేబదిలక్షలరూప్యములుగ నిర్ణయించెను కావున నిరభ్యంతరముగ మన మీవాక్యము నంగీకరింప వచ్చును.

పూర్వోక్తవిధముగఁ జక్రవర్తియాజ్ఞ యైన వెనుక నాగద్దియ యొక్క నిర్మాణకార్యము లారంభ మయ్యెను. బెబదల్ ఖానుని యాధిపత్యము క్రింద నీనైపుణ్యమునం దారితేరి మిగుల చాకచక్యముగఁ బనిచేయఁ గలిగిన

యోధులు పెక్కండ్రు నేమింపఁ బడిరి. తరుచుగ షాహాజహాన్ గూడ స్వయముగ నానిర్మాణమును బరీక్షించుచు, "ఆహా! ఈరా జెంతటి కళాకౌశల్యవిదుఁడో" యని పనివాం డ్రబ్బురపడఁ దగి నట్లుగ వారి కయ్యై సందర్భములకు వలయు నుపాయములను, నూతనరచనాచమత్కారములను, జూపుచుండెను. ఇట్లొకటిన మేనియు నాపఁ బడక శీఘ్రదీక్షగ నిర్మింపఁ బడుచున్న నాపీఠ మేడువత్సరములకు పిమ్మట సర్వాంగపరిపూర్ణమై కర్మశాల నుండి వెలుపలికి దేఁ బడియెను. దానికి "తఖ్తుతాఊస్"(మయూరాసనము) అను పే రిడిరి. కవితామాధుర్యముచేతను, మృదుపదలాలిత్యముచేతను,నొప్పారెడు నొకకవిశ్రేష్ఠుం డీపీఠనిర్మాణము సమాప్తియైన వత్సరము నొకపద్యార్ధమునం దిట్లిమిడ్చి చెప్పెను "సరీరె హుమాయూనె షాహెన్ కురానీ" ఈవాక్యమునకు 'సర్వశ్రేష్ఠుం డగు రాజుయొక్క మంగళప్రదమయిన సింహాసనము,' అని బాహ్యార్థము. గాని మనసంస్కృతభాషా సంఖ్యలను వాక్యములతో వ్రాసి "అంకానాం వామతో గతిః" యను సూత్రప్రకారము వెనుకనుంచి పదములను విడదీసి వానికి లక్ష్యము లగు సంఖ్యల నేరి వత్సరములను గనుగొను నట్లే పారసీభాషయందుఁ గూడ సంఖ్యలకు నక్షరసౌజ్ఞ గలదు. కవిశ్రేష్ఠు లగువారే దేని చారిత్రికవత్సరమును దెలుపవలసినప్పు డిట్లే పద్యములను వ్రాసి సంవత్సరము నం దిమిడ్చెదరు. ఈప్రకారముగఁ జూచినచో దానిలో వ్రాయఁ బడిన వత్సరము ౧౦౪౪ హిజ్రీ యగును. (క్రీ॥శ॥1634)

అనంతరము తఖ్తుతావసు (మయూరాసనము) ను రాజదర్బారులోనికి దెచ్చిపెట్టిరి. ప్రపంచమునం దున్న మహాద్భాగ్య మంతయు నొకచో మూర్తీభవించి నట్లు చూపరుల కద్భుతము దోపఁ జేయుఁ దనయం దిమిడ్చబడిన రత్నములతోడను, కళాకౌశల్యముతోడను నాగద్దియ యపరిమితశోభాసమేత మై రాజవైభవమునకుం దగిన సంపూర్ణస్వరూపముతో విరాజిల్లుచుండెను. షాహాజహానుచక్రవర్తి తన బుద్ధిచాతుర్యము నంతయు నుప

రోగించి చేయించిన యనుపమాన మని చెప్ప నొప్పు నీగద్దియను సర్వాంగ పరిపూర్ణ మైనపిదపఁ [illegible]చిన పరిశ్రమనిమిత్తమునం దెట్టి సంతోషము నొందెనో దానిని మే మిట వేరుగ మాకుఁ దోఁచి నట్లు వ్రాయక యావిష రము "ఏక మహోత్కృష్టకార్యమును దలపెట్టి తత్సమాప్తికై మిగుల పూనికతోఁ బాటుపడి దాని పర్యవసానఫలమును దమజీవితకాలముననే కాంచఁ గలిగిన యదృష్టశాలులకే విదిత" మని చెప్పుట సమంజసముగను స్వభావోక్తిగను నుండు నని తలంచు చున్నాము.

పీఠాధిరోహణమున కొకనుదివస మేర్పాటు కాఁబడిన పిమ్మట నా నాఁడు పట్టణ మంతయుఁ మిక్కిలి శృంగారముగ నలంకరింపఁ బడియె. భరతఖండ మందలి సుప్రసిద్ధు లగు పురుషపుంగవు లందఱును సమాహూయులై తత్తదుచితస్థానముల సభ నలంకరించిరి ఏర్పాటు కాఁబడిన శుభ లగ్నమున కొక కొన్ని నిమిషములకు ముందుగ షాహాజహానుచక్రవర్తి రాజాధిరాజచిహ్నములతో దర్బారులోని కేతెంచి యత్యంతభక్తితోఁ గించిత్కాలము భగవంతుని మనంబున ధ్యానించి యాసిమ్మట ఖురాన్ లోని పగు రెం డీశ్వరప్రార్థనాపద్యములను జదివి సభాసదు లందఱి తట్టు మరలి యిట్లు చెప్పెను.

"ఇంత వైశాల్యమును, నింతటి ఫలవంతమును నగు మహారాజ్యమును నాయాధీనమునం దుంచి నందులకును, కోట్లకొలఁదిగ నున్న మానవుల ప్రాణము లెల్లను నా యొక్కని యాజ్ఞాబద్ధము లై సంచరించు నట్లనుగ్రహించి నందులకును నేను సర్వశక్తియుతుఁడును, సర్వశ్రేష్ఠుఁడును నగు పరమేశ్వరునకు కృతజ్ఞతావందనముల నర్పించు చున్నాఁడను. గతకాలము నందు ఫరోఁవ్ నామకచక్రవర్తి నాతఖ్తున కేవిధమునను బోలి యుండని తఖ్తొక దానిని నిర్మించి తానే దేవుఁడ నని సాధింప సాగెను; కాని నే నాయద్వితీయుఁ డగు పరాత్పరుని కోల లక్షమారులు వినమ్రుఁడ నయ్యెద

నని చెప్పుకొనుచున్నాను. మఱియు నాపాపములకు పశ్చాత్తప్తుఁడ నై సభక్తికముగ సాగిలఁబడి యాజగత్కర్తను గూర్చి "ఓరక్షకా! నన్నీప్రపంచమునం దెట్లొక సాధికారపురుషునిగఁ జేసితివో యట్లే యంతమందుఁగూడ నాకు నీకడ నొక గౌరవస్థాన మనుగ్రహింప వలయు నని ప్రార్థింపు చున్నాను. ఎవని మాహాత్మ్యమును వర్ణింప నానాలుకకు శక్తి చాలకున్నదో యట్టి సృష్టిస్థితిలయకారకుఁడును, భక్తుల విన్నపముల నాలించు కరుణానిధియును నగు పరమాత్ముఁ డంత్యకాలమున నాకు చేయూం డిచ్చి దయతో రక్షించెడినిగాక.

ఇట్లు చెప్పి యాచక్రవర్తియును సభికులును గలిసి భగవత్ప్రార్థన (నమాజు) జేయ నుపక్రమించి మహమ్మదీయమతసాంప్రదాయక ప్రకారముగ నీశ్వరుని దృష్టిపథమునం దిడుకొని యాతనికి సాష్టాంగ మెఱఁగిరి. నమాజు నుండి లేవఁగనే షాహాజహానుగడ్డముమీఁదినుండి జలబిందువులు రాలు చుండెను. ఆ దృశ్యమును గాంచి సభాసదు లందఱును నాసత్పురుషుని పశ్చాత్తప్తహృదయమున కద్భుతము నొందిరి.

ఇఁక నిచ్చట నుండి మాచదువరులకు తఖ్తుతావుసు యొక్క మనోహర మగు స్వరూపపు ప్రతిబింబమును నివేదించెదము.

నెమలిగద్దియ యొక్క యెత్తైదుగజములు. వెడల్పు ($2\frac{1}{2}$) రెండున్నరగజము. పొడవు ($3\frac{1}{4}$) మూడుంబావుగజము. ఇదిస్వచ్ఛమైన బంగారముతోఁ జేయఁ బడిన దై యారుకాళ్లపై నిలిచి యుండును. దీనిమీఁది కెక్కుటకు మూఁడు సోపానము లమర్పఁ బడి యుండెను. ఈసోపానములం దిమిడ్చిన యమూల్యము లగు జీవమణుల నుండి వెడలెడి ప్రకాశము చూపరుల కన్నులకు మిరుమిట్లు గొలుపు చుండెను. పీఠముమీఁద నతిసూక్ష్మతరమును నతిసుందరమును నగు పనితనముతో రత్నములను దాపి చిత్రింపఁ బడిన పండ్రెండు స్వర్ణస్తంభములు, పైభాగమున వివిధము లగుమణుల

చేఁ గూర్పఁబడి చుట్టును వ్రేలాడు చుండిన ముత్యముల జాలరిచే నొప్పా చున్న ఛత్రమును నిర్వహించుచుండెను. ఈఛత్రముయొక్క లోపలి భాగమున జేయఁ బడిన యసమానమును, నతిమనోహరమును, నగు చెక్కడపు మీనాకారీ (లత) పనితనము భగవంతుఁడు మానవున కనుగ్రహించిన బుద్ధి వైశద్యమును వేయి నోళ్లఁ బ్రకటించు చుండెను. ఈతఖ్తుపై షాహజహాను చక్రవర్తి తన రాజచిహ్నముల నన్నిటిని ధరించి కూర్చుని యున్నప్పు డెల్లను నవరత్నఖచిత మగు ఛత్రము నుండి వెడలుచుండెడి తేజోకిరణములాతని సుందరస్వరూపముపై ప్రతిఫలించి యాసౌందర్యము నినుమడింపఁ జేయుచు నొకవిధ మగు నూతనశోభ నొసఁగు చుండెను. తఖ్తులకు రెండు పార్శ్వముల వజ్రవైడూర్యాదిమణులచే నలంకరితము లగు రెండు చక్కని మయూరములు, పచ్చలచే నిర్మింపఁ బడిన తమ చుంచువుల యందు మంచిముత్యముల మాలల నిడుకొని నానావిధరత్నఘటితము లైన పింఛములను రెక్కలను విప్పి నీడ నిచ్చు నట్లుగ చిత్రింపఁ బడి యుండెను. ఈ నెమళ్లు దమయం దిమిడింపఁ బడిన మణులచే ననుపమానము లై యొప్పారు చుండెను.

ఈపనివాని నేర్పరితనమును గాంచి "బర్నియర్" అను ఫ్రాంసుదేశవాసి యగు నొకయాత్రికుఁడు తమదేశమునం దాకాలమున శిల్పిశాస్త్రమునం దద్వితీయుఁ డని పే రొందిన యొకపనివాఁ డుండె ననియు, నాతఁడు కల్పితరత్నములను నిజరత్నము లని విక్రయించిన నేరమునందు బట్టుపడి తా నొనర్చిన దుష్కార్యమున కయ్యెడు శిక్షకు వెరచి హిందూస్థానమునకు పారి వచ్చె ననియును, నీమయూరాసనముపై నున్న యత్యద్భుతశిల్పము లన్నియుఁ దప్పక వానిచేతనే చేయంబడి యుండ నోపు ననియును నిర్భయముగ వ్రాసెను. కాని చరిత్రకారులకడ నీబర్నియర్ యొక్క యభిప్రాయ మణుమాత్ర మేనియు గౌరవింపఁ బడక పోవు టటుండ మీదుమిక్కిలి వారందఱు నాశియాఖం

డపు యప్రతిమ మగు కళాకౌశల్య చాతురీగరిమను గాంచి సహింపఁజాలక
యోర్వఁ డిట్లు తన యోరువలేమిని బ్రకటించె నని యైకకంఠ్యముగ నొప్పు
కొనిరి. తఖ్తు తావునన కిరుప్రక్కల నుండెడి యామయూరముల మధ్యభాగ
మున నొక్కొక్క పెద్దవజ్రము స్థాపింపఁబడి యుండిన తమ యుదరముల
నొయ్యారమునఁ బై కుబికించి చూచువారికి సజీవములో యని తోఁపఁ జే
యుచు మిక్కిలి విమర్శగఁ బరికించి చూడనిచో నివి నిర్జీవప్రతిమ లని
తెలుసుకొనుట కలవిగా నట్లు నిలుపం బడి యుండెను. తఖ్తునకు వెనుక
భాగమున నొక బంగారపుచెట్టు గలదు. దాని కొమ్మలలోఁ దెల్లని మణు
లును, యాకులలోఁ బచ్చని మణులును దాపఁబడి యుండెను. దాని కమర్పఁ
బడిన రత్నస్థగితము లగుపండ్లు మిక్కిలి మనోహరముగ ద్రాక్షగెలల
వలె వ్రేలాడుచుండెను. ఈచెట్టునందలి పనితనమును వీక్షించు నపు
డు దానియం దమర్పఁ బడిన యమూల్యరత్నములుగూడ నా యనన్య
శిల్పచాతుర్యముకడ నొకలెక్కలోనివిగఁ గనుపింపవు. మయూరాసనము
నందు పలకల వలె ననేకవిధము లగు మణులచే నిర్మింపఁబడిన భాగములు
పదునొకండు గలవు. వానిలో వెనుక తట్టు చక్రవర్తి యానుకొని కూ
ర్చుండు (తకియా) పలక మిగుల ప్రాముఖ్య మయినది. దాని వెల పదిల
క్షల రూప్యముల కే మాత్రమును దక్కువకా దని రత్నశాస్త్రవేత్తలు నిర్ణ
యించిరి. ఈతకియాకు మధ్యభాగము నందు చరిత్రముతో సంబంధించి
యున్న రత్న మొకటి దేదీప్యమానముగఁ బ్రకాశించు చుండెను. ఆరత్న
మును ఈరాన్ (పర్షియా) రా జగు షాహా అబ్బాస్ సఫివి తన మో
తప దగు (శక్రిటరీ) జంబీర్ బేగును రాయభారిగ నంపి నప్పుడు జహాన్
గీరుచక్రవర్తికి కానుకగ నంపెను. దీని మూల్యము పదిలక్షలుగ నుండు
నని యాకాలపు మేధాసంపన్నులు నిర్ణయించి యుండిరి. ఇది మన
షాహాజహానునకు తక్కిన సకల భాగ్యములతో పాటు వారసత్వమున
చ్చినది కాదు. దఖ్ఖన్ (దక్షిణ) రాజ్య మాతని సైన్యానాయకత్వము

క్రింద జయింపఁ బడె ననుసువార్త తెలిసి నప్పుడు సంతోషపూర్వకముగ జహాఁగీరుచే షాహజహానునకు బహుమానముగ నీయఁ బడినది. ఈరత్నముపై మొదట "సాహెబు కురాఁ అవ్వల్, మిర్జా షాహరుఖ్, మీర్జాఅనాబేగ్" అను 3 పేరులు చెక్కఁ బడి యుండె ననియును దరువాత కాలవశమున షాహ అబ్బాసు సఫ్వీకి లభ్యమయినప్పుడాతఁడు గూడ నద్దానిపై తననామమును జెక్కించుకొనె ననియును హా పిమ్మట షాహజహాను తన తండ్రిపేరును దనపేరును సైతము చెక్కించి యుండె ననియును జెప్పుదురు. ఇట్టి చారిత్రాత్మక మగు మహామణి యొక్క యదృష్టమునం దిద్దరు సార్వభౌముల స్వాధీనమునం దుండిన వెనుక మయూరాసనమును శోభింపజేయుట కంపలి యలంకారము లై నిలిచి యుండు మని వ్రాసి యుండ నోపు నను నట్లు చివరకి విశేషముగ నారత్నమునకు స్థిరస్థాన మేర్పడియెను.

తఖ్తు తావుసు పైకి దృష్టి సారించఁగనే యన్నిటికంటె ముందుగ మనచూపులను దనవైపున కాకర్షించుకొనునవి 'హాజీ మహమ్మదు జాఁ కుద్సీ' యను కవిశ్రేష్ఠునిచే రచియింపఁబడిన చారిత్రాత్మకము లగు పద్యము లయి యున్నవి.

ఇవి యాతఖ్తుపైఁ జేయఁబడిన బంగారపు పనితనమునం దచ్చటచ్చట సందర్భమున కనుకూల మగునట్లుగ దివ్య సుందరము లగు యక్షరములతోఁ జెక్కఁ బడి యుండెను. నాలుగుపాదములు గలిసి రెండు చరణము లగును. పర్షియన్ భాషలో దీని నొక్కొక పద్యముగ భావించెదరు. తెలుగులో నున్నట్లు యతిప్రాసలనిర్బంధ మీభాషలో లేకున్నను నంత్యనియమములును, యే యే పద్యపాద మెంతగ నుండవలెనో యావిషయమైన యక్షరనిబంధనలును గలవు. ఆపద్ధతి ననుసరించి యీపద్యములు "మస్నవీ" యను పేరిటి పద్యతరగతిలోఁ జేరును. మహమ్మద్

జాక్ గారు తఖ్తును గూర్చి (౪౦) నలువది పాదములుగల (౧౦) పదిపద్యములను వ్రాసిరి. పదసౌష్ఠవమును, అర్థాలంకారమును జూచి వానిలో దేనినిగూడ విడుచుటకు నిచ్చలేక కాంబోలు షాహజహాను వాని నన్నిటిని సంపూర్తిగఁ దనగద్దియపైఁ జెక్కించెను. ఈపద్యములు పర్షియన్ భాషలో రచియింపఁ బడుటచే మన తెనుఁగులో వ్రాసి చూపుటంత సమంజసముగ నుండక పోయినను జారిత్రాత్మకము లగుటచే శాసనముల యందును, నితిహాసముల యందును బ్రేమగలవార లీగద్దియ యందు వ్రాయఁ బడిన పదములను వినుటకు తప్పక ప్రేమింతు రని యోచించి వాని నిట్చట వ్రాసి యేపాదమున కర్థ మాపాదముక్రింద వ్యాఖ్యానరూపకముగఁ వివరించెదను.

మస్నవీ.

I (1) జాహే ఫరఖుండ తఖ్తె బాదుషాహ్

ఆహా! ఈరోజు గద్దియ ఎంత పవిత్రతర మయినదిగ నున్నది.

(2) కెషుద్ సామానె బతాయీదె ఇలాహ్

ఏలయన దీనిసాధనము లన్నియు భగవత్సహాయముచే సమకూరెను. (అనఁగా దీని నిర్మాణమున కంతకును నాతఁడే ప్రయత్నకారకు డయ్యెనని భావము.)

(3) ఫలక్ రోజే కెమీకర్దష్ ముకమ్మిల్

ఏదినమున దైవమీప్రయత్నమును (ఈసాధనములను సీకరించుటయను పనిని) నిశ్చయము జేసెనో!

(4) జరేఖుర్షీద్ రాబగుదాఖ్తు అవ్వల్—(ఆపిమ్మట) ప్రప్రథమమున సూర్యునిలోనున్న బంగారమునంతను గరగించెను (సూర్యునిలో సువర్ణ మున్న దని యొకమతము గాన దాని ననుసరించి యీసువర్ణమును దీనికొఱకు భూమిపై కనిచె నని భావము)

II (1) బహశు క్ష్మకారేఫర్మాసరఫ్ షుద్ పాక్ — ఆ(పనిని దలపెట్టిన) యధికారి (అనఁగా దైవము అని భావము) యొక్క యాజ్ఞవలన సర్వస్వము వ్యయ మయ్యెను.

(2) బమీనాకారి కుమ్మీనాయెఆఫ్లాక్ — దైవశక్తి యందలి కౌశల్య మంతయును దీనియొక్క పనితనమున కై (మొదటి పాదముతో నన్వయము పూర్తి యగును.)

(3) జుజీఁతత్రై ఆజ్ జర్దెగౌహర్ చెపష్ఫంద్ — ఈగద్దియ నుపయోగింపఁ బడుటకు గాకపోయినచో (నిఁక) నీవజ్రములయొక్కయు బంగారముయొక్కయు (సృష్టికి) యుద్దేశ మేమి?

(4) వజూర్ బహేరో కాణ్ రాహిక్మత్ ఈఁబూద్ — సముద్రము యొక్కయు గనులయొక్కయు నుత్పత్తిస్థితులకు గూడ నిదియే యోచన (కారణము)మై యున్నది. (అనఁగా సముద్రమునం గల రత్నములు గనుల యందలి రత్నములును దీనిలో నున్న వని భావము)

III (1) జీయాకూతమ్ కదర్ కై దెబహాసేస్త్ — దీనిలోని యర్రటిరత్నములకు మూల్యమే (నిర్ధారణ) లేదు (అమూల్యము లయినవి).

(2) లజేలాలెబుతాఁరాజిల్ బజానేస్త్ — సౌందర్యవతియొక్క పెదవి యీరత్నములను చూచి (తా నట్లు లే నని) విచారపడుచున్నది.

(3) బరాయెసాయ్యేఆష్ఉంరేకషేద — దీని (ఈగద్దియ) యొక్క కాలిగానికి వచ్చుటకై (ఎక్కువ) వయఃకాలమును నిరీక్షణలో గడపినవి.

(4) గోహారెఅఫ్సర్ బసర్ ఖాతంబేదీద — తలలయందలి కిరీటముల

లోను సంగరములయందలి గూడులలోను ఉండినరత్నములు (3 వ పాదార్థముతో అన్వయము.)

(అనగా) రాజులకిరీటముల యందలివియును, సంగరముల యందలివియును నగు మణులు తా మీగద్దియకాలిలోని కేతెంచుట యెక్కుడుగౌరవ మని తలపోసి నిరీక్షణయం దుండెను. (అట్టి వెల్ల నిప్పు డిందులో నున్న వని భావము)

IV (1) బదర్ఖష్ ఆ లెంజ్ జర్ షుద్ జహాఁ పాక్ — దీని చెక్కడమున కై ప్రపంచములోని బంగార మంతయును వ్యయ మయ్యెను.

(2) కషుద్ అజ్ గంజ్ ఖాలీకి సైఖాక్ — అనగా భూదేవిగర్భమునం దున్న దివ్యభాండారపు సంచి యంతయు వట్టి దయ్యెను.

(3) రసానద్ గర్ ఫల్క్ ఖుదారా బెపాయిష్ — ఒకవేళ నాకాశము తన్ను దా నీగద్దియపాదముల యొద్దకు దెచ్చికొనినచో

(4) దెహద్ ఖుర్ శేద్ వ మైరారూనుమాయిష్ — సూర్యుని చంద్రుని దీనిముఖాలంకారమున కై (కానుకగ) యిచ్చి వేయును.

V (1) సర్హరాజీ కెసర్ బరు పాయేఆష్ బూద్ — ఎవరిపాదము లీతఖ్తుపై నున్నవో యాగౌరవనీయుఁ డగు మహాపురుషుఁడు

(2) జ్ గిర్దూ నెపాయే బర్ తఖ్తై అఫ్జూద్ — ఈతఖ్తుయొక్క గొప్పఁదనమును నాకాశముకంటె నధిక పఱచెను (ఆకాశపీఠము నందు దైవ మధిష్టించి యున్నాఁ డని ఇస్లామీ మతము)

(3) ఖిరాజెబహారెకాన్ పైరాయేడూ — సముద్రములును, గనులును దీని యలంకారములకై యుండినవి.

(4) పనాహె అర్ష్ వకుర్సీసాయేడూ — అర్ష్, కుర్సియనునాకాశములు, దీనినీడలోనికి రాఁగలవు. (ఏడాకాశము లు స్వర్గముల మహాప్సు

దీయమతము. వానిలో మొదటిది నక్షత్రియుతము రెండవ దన్నిటికంటె పైది) (గౌరవమున వానికంటె నీగద్దియ మిన్నంటి వానిని తన నీడ క్రిందకు దెచ్చుకొనె నని కవి భావము)

VI (1) జో ఆన్వాజవాహర్ గష్తయేఐవాఁ — నానావిధరత్నముల కూర్పుచే విరాజిల్లు సింహాసనము యొక్క (యానసజ్యోతి) ద్యుతి యెట్లయిన దనఁగా

(2) చిరాగెఆలె మేపర్వానైఆఁ — సృష్టిలోని ప్రజ లందఱు దీనికి (దీపమును జూచి దానియొద్ది కరు దెంచెడు స్వభావముగల) శలభము లైరి.

(3) దర్ అత్రాఫ్ బూద్ గుల్హా యెమీనా — దీని ప్రక్కల యందు జేయఁ బడిన తీగెల చిత్రితములోని పుష్పము లెట్లు ప్రకాశించుచున్న వనఁగా

(4) ఫరోజానె చూఁచిరాగ్ అజ్ తూరెసీనా — తూరెసీనా యందలి దీపమువలెఁ బ్రకాశించు చున్నది. (తూరెసీనా యను పర్వతముపై దేవుఁ డెక్కి భక్తులతో సంభాషించె నని మహమ్మదీయమతము. అందుచే నాయనకాంతి యెప్పటికిని నాపర్వతముపై ప్రతిఫలించుచు జ్యోతి యై ప్రకాశించు చుండు నట)

VII (1) చూమీకర్ద్ అజ్ ఫరాజష్కో తెహీదస్త — ఔన్నత్యమునందు తనచేయి వెను కయ్యెను.

(2) నగినెఖ్వేష్ జంబర్ పాయేఁఅష్ బస్త — ఇందువలన జంషీదు తన రాజముద్రను నీగద్దియ యొక్క పాదమున కంటఁ గట్టెను. (జంషీదు అను నాతఁడు ప్రాచీనకాలమునఁ బారసీకమునం దతి

విఖ్యాతిగల యొక చక్రవర్తి. ఆయన యౌన్నత్యమునగూడ నీరాజు యొక్క యౌన్నత్యమునకు సరిరాదని యర్థము అనఁగా సర్వ రాజాధిరాజుల శిఖాయుంగరములలోని మణులవంటి యనేకములు దీనికాలియందున్న వని భావము (మొదటిపాదములో నన్వయము పూర్తి.)

(3) సజేతాదాజ్ పురోన్ లాల్ వగౌహర్ — (ఈగద్దియు) గాఢంధకారపు రాత్రిని (దనయందలి) వజ్రవైడూర్యాదిరత్నముల ప్రకాశముతో

(4) తవానద్ సర్ ఫల్క్ రాదాదె అఖ్తర్ — ఒకవేళ దలఁచినచో నూరుఆకాశములకు నక్షత్రములను రచియింపఁ గలదు.

VIII (1) దెహద్ షాహెజహాఁరాజో సైజర్ పాయ్ — షాహాజహాను యొక్క పాదమును ముద్దిడుకొనుచున్నది.

(2) అజాఁ షుద్ పాయకద్రష్ ఫల్క్ సాయ్ — ఇందువలననే యీ తఖ్తుయొక్క గొప్పదన మాకాశము(దైవపీఠము)తో సరి యైనది. (అని చెప్పవలసి వచ్చినది.)

(అనఁగా రాజునందు దైవాంశము గలదు గాన నీతఖ్తుగూడ నా తఖ్తునకు సరి యని భావము)

(3) కునద్ షాహెజహాఁ బఖ్షవజవానెబఖ్త్ — అతిఘనతగలవాఁడగు నీషాహజహాను దాతృత్వమునం దత్యుత్కృష్టుఁడు.

(4) ఖిరాజెఅతెమీరాఖచెఁయెక్ లఖ్త్ — ప్రపంచపు యాదాయము నంతయు నొక్క నిమిషములో వ్యయపెట్టును.

IX (1) ఖుదావందేకె అఫ్లాకర్సీఅఫ్రాఖ్త్ — ఆకాశ(పీఠ)మును నిర్మించిన దేవుఁడో యాదేవున (ఆవిశ్వకర్మ) కు మాత్రమే

(2) తవానద్ కుద్రతే షత్ తఖ్తే చునీసాఖ్త్— ఈవిధ మగు గద్దియను రచియింపఁ జేయుటకు శక్తి గలిగి యుండుట సంభవము గా నోపును. (ఒరులకు గా దనిభావము)

(అనఁగా షాహాజహానుయొక్క మయూరాసననిర్మాణయోచనా నైపుణిని మించినవాఁ డెవఁడున్నచో నట్టివాఁడిఁక భగవంతుఁడే యని యర్థము)

(3) అసర్ బాకీ—తాకౌనోమకాఁ రా— భూమ్యాకాశములయొక్క గుర్తులెంతదనుక నిలిచి యుండునో

(4) బువద్ బర్ తఖ్త్ జాషాహేజహాఁ రా— (అంతదనుక) ఈతఖ్తుపైన షాహాజహానుయొక్క స్థలము నిలిచి (స్థిరమై) యుండుగాక. (ఆశీర్వాదము)

X (1) బువద్ తఖ్తే చునీహర్రోజ్ జాయష్— ఈవిధ మైన గద్దియయే ప్రతిదినము నాయనకు కూర్చుండు స్థల మగుగాక.

(2) ఖిరాజేహఫ్త్ కష్వరె జేరెపాయష్— సప్తఖండముల కప్పము లీగద్దియక్రింద నమరి యుండుగాక.

(పృథివియంతయు దీనిపై నధిష్ఠించి యుండెడు పురుషుని యాధిపత్యమునం దుండెడుగాక యని యాశీర్వాదభావము)

(3) చూఁ తారీఖష్ జబాఁ పుర్సీద్ అజ్ దిల్— దీని(జనిత)కాలమునుగూర్చి (నిర్మాణపువత్సరమును) నాలుక హృదయము నడుఁగఁ గా

(4) బెగుఫ్త్ ఔరంగ్ షహాఁ షాహె ఆదిల్— ఇది న్యాయమును దయచేయు నట్టి చక్రవర్తియొక్క గద్దియ యని (హృదయము బదులు) చెప్పెను (నాలుగవ పాదము నందలి యక్షరము లన్నింటి

కేర్పడి యున్న సాంకేతికసంఖ్యల నొకచోఁ జేర్చి కూడిన చో ౧౦౭౮ వచ్చును. ఇది హిజ్రీ శకము.

(ఈగుర్తు వేయఁ బడిన స్థలముల యందలి శబ్దములు అనునాసికోచ్చారణములు.)

మయూరాసనమునకు ముందుప్రక్కగ, బంగారపు పనితనముతో మధ్యభాగమును గప్పి యున్న పచ్చలపందిలి యొకటి కలదు. అది నానా విధము లగు యింద్రనీలములు, పచ్చలు మొదలగువాని తోడను, నలుముఖముల వ్రేలాడు చుండు జరతారు జాలర్ (బంగారపు నీటిచేఁ బూయఁ బడిన దారములతో నల్లిన కుచ్చుల వల)యం దత్యలంకారముగ నమరి యున్న యాణిముత్యములతోడను నతి తేజోవంత మై, గంగాయమునా నదుల యందలి స్వర్ణముచేఁ జేయఁ బడిన స్తంభములపై నిలిచి యుండెను. దాని కిరుప్రక్కలను అమీరులు, ఉమ్రావులు, మంత్రులు మున్నగు ప్రముఖు లాసీను లై యుండుటకై తత్తదర్హము లగు నాసనము లలంకరించి యుంపఁ బడి సభాభవనపు కళాకాంతుల నినుమడింపఁ జేయు చుండెను. రాజాధిష్ఠిత భాగమును బ్రత్యేకపఱచి తద్గౌరవాధిక్యతను సూచించు నట్లుగ గద్దియను చుట్టును రెండుగజముల స్థలమున కప్వల వెండివలతో (కటకర్)నొక యావరణరూప మేర్పరుపఁ బడి యుండెను. ఆ వలయందు చిత్రింపఁ బడిన లతాకౌశలము చూచువారల దృష్టిని తనపై నిలువ నీయ కుండు నంతటి సూక్ష్మతర మై, యతిసుందర మై మనోహరముగ నుండెను. ఇఁక నిచ్చటనే మీమయూరాసనపు స్వరూపవర్ణనమును సమాప్తి పఱచి దీనిని గుఱించి బర్నియర్ యొక్క యభిప్రాయమును మిగుల విచారముతోఁ జదువరులకు నివేదించెదము. ఆయన యిట్లు చెప్పెను. "దీని యం దలంకరితము లై యున్న యసంఖ్యాకములును, నతి మూల్యవంతములును నగు రత్నములచే నిది యొక యమూల్యాసన మని చెప్పుట కభ్యంతర మేమియును లేదు; కాని యిదియే "ఏషియా" (ప్రాక్ప్రపంచము)యందలి కళాకౌశలము యొక్క

సర్వోత్తమ మగు మాదిరి (నమూనా)యని చూపించుటకుఁ దగి నంతటి గొప్పపనితనము మాత్ర మిం దేమియును గాన్పింపదు. జీవమణుల యొక్క ప్రకాశముచేఁ గన్నులకు మిరుమిట్లు గొలుపు చున్న కాంతివైభవము తప్ప దీని నిర్మాణమునం దిం కేమియును వర్ణనీయ మగు విషయము గాన రాదు."

ఈ "డాక్టర్ బర్నియర్" ఒకవేళ నితరాంశములను వివరించు సందర్భములయం దున్న దున్నట్లు వ్రాసి తనన్యాయదృష్టిని బ్రకటించుకొని యుండును గాని యీవిషయమునం దిచ్చిన యభిప్రాయము మాత్రము సంపూర్ణ మగు నన్యాయముతో మిశ్రిత మై యున్నది. ఈస్థలమునం దాత డొక చారిత్రకారుని వలె తన కలమును బక్షపాతరహితముగ నడుపక యీ రూపముగఁ దన్నుదా నొక యోరువలేని పరాసీయునిగ ధృవపఱచుకొని యెను. ప్రాగ్దేశీయకర్మకౌశల మెంత స్తుతిపాత్రమైనదిగ నున్నను నది యాతని దృష్టికి హృదయకంటకముగ నుండెను గదా!"

మయూరాసనముపై మొగలాయి ప్రభువులు నాదర్‌షా దాడి కేతెంచు దనుక మిగుల వైభవ ప్రతాపములతో నాసీను లగు చుండిరి. గాని ౧౧౫౧ హిజరీశకమునం దీ యీరానీ (పారసీక) సరదారుఁడు మహమ్మదుషా యొక్క సుఖలోలతను నాతని సైనికుల బలహీనతను, ప్రజానురాగశూన్యతను గూర్చిన వార్తా పరంపరల నాకర్ణించి హిందూస్థానపు సౌభాగ్యమును జూరగొనుటకై కాలాంతకుఁడో యను నట్టి ఈరాక్, ఆఫ్ఘాన్, సైనికుల సాయముతో భారతభూమిపై విరుగఁబడియెను. ఆనాదర్ దోపుడుసమయము నందు వానికి దొరకిన యపరిమితమగు భాగ్యములో "దేనిని షాహజహాను సార్వభౌముఁ డతిప్రేమతో నతిశ్రద్ధతో నత్యంత శ్రమతో నిర్మింపఁ జేసెనో మఱియు నేది హిందూస్థానమునందే గాక ప్రపంచము నందన్ని చెరగుల వారిచేతను నుపమానరహిత మగు గద్దియగ భావింపఁబడు చుండెనో యట్టి మయూరాసనము గూడ నొకటి యై ఈరానునకు ప్రవేశించెను.

“ జహాఁ కుషాయెనాదరీ” (నాదర్ యొక్క ప్రపంచ విజయము) యను గ్రంథమునం దాగ్రంథకారుఁ డిట్లు వ్రాయుచున్నాఁడు “మయూరాసనములో పాటించక ననేకము లగు యమూల్యపదార్థము లనఁగా ముత్యములు, వజ్రములు, కెంపులు, మొదలగు రత్నములును నానారూపములు గలిగి వివిధనామములచే బేర్కొనం బడు యసంఖ్యాకములును నతిప్రకాశమానములును నగు నాభరణములు నాదరు వెంట ఈరానుకు జేర్పఁ బడియెను. ఈలోకము నందలి యేభాగ్యవంత మగు ప్రభుత్వ మైనను వానిలో నొకదాని కైనను దుల్య మగు పదార్థమును దన యొద్దనుండి చూపఁ జాలదు.”

ఇవ్విధముగ నాదరుషా హిందూస్థానపు సంపద నెల్లను దోఁచుకొని ఈరానున కరిగి పిమ్మట వెంటనే స్వయముగ నాయకుఁడై సైన్యమును నడుపవలసి నంతటి దుర్ఘట మగు పోరాట మెద్దియో యవ్వలఁ దటస్థించుట వలన నీద్రవ్య సంచయము నంతయు హారాత్ (హరట్) యను పట్టణమున కంపి తనక్రింది యుద్యోగస్థుల కిట్లాజ్ఞాపించెను. “ నేను తిరుగ నేతెంచు దనుక సైన్యమంతయును నీద్రవ్యరక్షణము గావించుకొనుచు నిందే యుండవలయును. మఱియు నేను తిరుగ నేతెంచు నంతలో హిందూస్థానము నుండి కొల్ల గొట్టి తెచ్చిన రత్నములతో నొకతఖ్తును నిర్మింప వలయును. అదియే యంశమునను మయూరాసనమునకు తీసిపోగూడదు. మనలో సాధారణముగఁ గొంచ అధికారుల కెదురుమాటజెప్పఁజాలని యుత్తరువులకు సుగ్రీవాజ్ఞ యని పోల్చి చెప్పెడి వాడుక గలదు. ఆకాలమున సుగ్రీవుఁ డంతటి కఠినశాసనుఁడై యుండనోపును. అట్లే మహమ్మదీయులలోఁ గూడ హుకుంనాదర్షాహీ యను సామెత వాడుకయం దున్నది. తప్పక జరిగ తీరవలసిన పనులను గూర్చి యీమాట నుపయోగించెదరు దీనినిబట్టి నాదర్ షా తనకాలమునం దొక చండశాసనుం డై యుండెనని మన మూహింప

వచ్చెను. ఇట్టి మీరఁజాలని నాదరుషా యాజ్ఞయొక్క యనుష్ఠానమునం దాలస్య మొనరించు టెవ్వరికి తరమగును? తక్షణమే పటము (ప్లాను) సిద్ధ మయ్యెను. ఈరాను దేశీయులును హిందూదేశీయులును నగు పెక్కండ్రు కర్మకారులు నియోగింపఁ బడి పని నారంభించిరి. పనివారల హృదయములయందు నాదరుషా యొక్క భయ మెక్కుడుగ నుండుట చేతను, దండయాత్రనుండి తిరుగ నేతెంచుటకు పూర్వమే గద్దియ సిద్ధము గావలయునని యాతఁ డొనరించిన కఠినమగు యాజ్ఞ తప్పనవరతము నాతురత పఱచుచుండుట చేతను నానిర్మాణకార్య మింతింత నని చెప్పుట కలవి కాని వేగముతోఁ బూర్తి గాసాగెను. దివారాత్రములయం దొకనిమిషము నేనియు వృథ గా నీయక నివ్విధముగ నెంత కష్టించి పని చేసినను నేక సంవత్సరకాల మీనిర్మాణమునందు వ్యయ మయ్యెను. తరువాత దీనికి తఖ్తె నాదరీ యని పే రిడిరి. మయూరాసనమున కై యెంతటి స్వర్ణ ముపయోగింపఁ బడెనో దానియం దెన్ని రత్నములు స్థాపింపఁ బడెనో యీతఖ్తుయొక్క నిర్మాణమునందు గూడ నంత స్వర్ణముతో నన్ని రత్నములతోఁ బనిఁగొనిరి; కాని ఇవ్విధముగ నెంతటి యసామాన్యవ్యవస్థలతో సిద్ధపరిచినను నైన మీ రెంటియందును శాశ్వత మగు భేద మేర్పరుపక పోలేదు. ఏమన, తఖ్తుతాఉసు (మయూరాసనము)యొక్క వృత్తాంతము కొంచె మెచ్చుతగ్గుగ నీలోకము నందు గల జనుల కందఱకు నెఱుక యై యున్నది. తఖ్తునాదరీ యొక్క సంగతిమాత్ర మెవ్వరికిని దెలియదు. తెలిసి యున్నను వారి సంఖ్య యత్యల్పము.

మయూరాసనము యొక్క సౌందర్యము, కళాకౌశలము, ప్రపంచమునం దంతటను నతిగాంచి యుండుటయును నాదరీతఖ్తుకూడ యంతటి మూల్యముతోడనే నిర్మింపఁ బడినను నది యూరు పేరు లేని యొక మూరుమూలను బడి యుండుటయును నిదియే పైనఁ జెప్పఁ బడిన భేదమున కొ

క కారణముగఁ గన్పట్టు చున్నది. ఇదిగాక మఱిరెండు ప్రబలహేతువు లగు పడు చున్నవి. అందు మొదటిది పరిపరిధమునం దీమయూరాసనము యొక్క పటువు కళాకౌశల్యమును దత్యుపాయ చతురిమ గల షాజహానుచే స్వయముగ సిద్ధ పరుపఁ బడినది. రెండవది; మయూరాసన నిర్మాణమున కర్మకారులకు తగినంత యోపికతోఁ దమకళాకౌశల్యమును జూపించుట కవకాశము దొరకెను. ఇందువలననే యది యేడువత్సరముల కాలములోఁ బూర్తి యయ్యెను. దీనికి వ్యతిరేకముగ తఖ్తు నాదరీ యొక్క నిర్మాణము నాదరీ యాజ్ఞ యత్యుగ్రమై యుండుకతన మిగుల వేగముగను, నసంతృప్తికరముగను నెరవేఱెను. నాదర్ షాహ దండయాత్రి నుండి యెప్పుడు తిరుగ నేతెంచునో యాతఁ డరుదెంచు నప్పటికీ గద్దియ పూర్తి గాకున్నచో నేమి శిక్షించునో యను భీతి ప్రతి నిమిషమును దమహృదయములను వేధించు చుండుటచేఁ బనివాండ్రు తఖ్తు నందు తమకళాకౌశల్యము నిచ్చ వచ్చినట్లుగ నగు పరుపఁ లేక పోయిరి.

నూతనతఖ్తు సిద్ధమైన యనంతరము నాదరుషా దానిని మయూరాసనపు చేరువ నుంచి కొంతకాలము దనుక రాజోచితోత్సవములను సల్పు చుండెను; గాని తనచేఁ జేయింపఁ బడిన తఖ్తునకు మయూరాసనమునం గల కాంతి కౌశల్యముల యందలి పోలిక యొక్కింతేనియు నమరి యుండ లేదని యెఱింగియే యున్నవాఁ డగుటం జేసి యాతనికి తఖ్తు తావసు నందు గల గౌరవభావము తఖ్తెనాదరి యం దెప్పటికిని గలుగ కుండెను.

నాదరుషా మయూరాసనమును ఈరానునకు తీసుకొని వెళ్లుటయు దానిని తఖ్తెనాదరీ యొద్దనుంచి యుత్సవములు జరుపు చుండుటయును నివి నిస్సందేహములుగ ధృవపడి యున్నవి. గాని నాదరుషాహ యొక్క యనంతరమీమయూరాసన మెచ్చటనుండెను? ఎవరియొద్దనుండెను? అనువిష

యములను గుఱించి యోచించి చూడఁగా ఈరాన్ దేశముపై యప్పటినుం డి నేఁటివరకు పరదేశీయులచే నేదేని రాజ్యక్రాంతి జరిగినట్లు చరిత్రముల వలనఁ గాన్పింపదు; గాన కాలవైపరీత్యముచే నిది యచ్చటనుండి మఱియొక విదేశీయభాగ్యమునందు సంక్రమించి పోయిన దని గాని లేక స్వరూపవినాశనమై నామమాత్రావశిష్టమైన దని గాని భావింపఁ గూడదనియును, నాదరుషాకు పిమ్మట నిప్పటివరకును నది ఈరానునందే యుండి ఈరాన్ ప్రభువుల యధీనమునకే చెందియున్నదనియును మన మూహింప వలసియున్నది. మఱియు ముజఫరుద్దీన్ షాకాచార్ యొక్క మరణానంతర మాతని పుత్రుని (ప్రస్తుతము పదభ్రష్టుఁడైన యాతని) సింహాసనాధిష్ఠితోత్సవ మీమయూరాసనమునందే జరిగి యున్నట్లు వార్తాపత్రికలలోఁ జదివియున్నాము గాన నిది తన స్వరూపమునందు మార్పు నొందక ఈరానుదేశమునందే యున్న దని భావించుటకే యభ్యంతరమును గానరాదు.

అక్కటా! ౧౦౪౪ హిజ్రీశకము మొదలు ౧౧౫౧ హిజ్రీశకము వరకు ౧౦౭ వత్సరముల కాల మవిచ్ఛిన్నముగ మొగలాయి సార్వభౌముల రాజ్యపీఠముగ నుండిన నీమయూరాసన మాపిమ్మట భరతమాతను దన వియోగచింతం బడఁద్రోసి యామె నుండి శాశ్వతముగ విడి పూర్వోక్తవిధముగ ఈరాను భాగ్యములోఁ గలసి పోయెను. అహో! కాలగతి యలంఘనీయము గదా!

శ్లో॥ సా రమ్యా నగరీ మహాన్ స నృపతిః సామంతచక్రం చ తత్
పార్శ్వే తస్య చ సా విదగ్ధపరిష త్తాశ్చంద్రబింబాననాః
ఉద్రిక్తః స చ రాజపుత్రనివహ స్తే వన్దిన స్తాః కథాః
సర్వం యస్య వశాదగా త్స్మృతిపథం కాలాయ తస్మై నమః॥

భర్తృహరి.

మ॥ అది మేనైనపురంబు పూజ్యచరితుం డారాజు రాణ్మండలం
బది పార్శ్వంబున నావిదగ్ధసభ వారత్నాస్య లత్యర్థితం
బది రాజన్యక మద్దివ్యాంగనికరం బాగాథలున్ సర్వమున్
గవలం జేసిన కాలమూర్తికి నమస్కారంబు సత్కీర్తికిన్.

అనున శ్లోకప్పడు సుందరమైన నగళ్లు, తత్పరిపాలకులు, తత్సామంతులు, తద్విద్వాంసులు, మొదలగు పరివారముతో నొప్పారు రాజన్యు లందఱు నశించి ప్రస్తుతము స్మరింపఁబడుటకుమాత్ర ముండునట్లు చేసినది కాలమహిమయే గదా! అటులనే యీ షాజహానును దానెంతయో ప్రేమతో, నెంతయో ధనవ్యయముతో, నెంతయో శ్రద్ధతోఁ జేయించిన యీ మయూరాసనము నిట్టి చరిత్రయునకు లోనుగావలసి వచ్చునట్లు చేసినదియుఁ గాలమహిమయే గదా! అట్టి కాలమహిమ నెఱుఁగ నెవరితర మగును!

కట్టా! భారతజననీ! నీదేహమున కమితాలంకారములుగ నున్న యమూల్యవస్తుసంచయ మంతయును నీ నుండి బలాత్కారముగ వేఱు సేయంబడెను. ఇఁక నీ న్యాయాలంకారములకొఱకును న్యాయాభరణములకొఱకును కన్నీరు వరద లగునట్లుగఁ బ్రళయకాలముదనుక నేడ్చినను నవి నీకు లభ్యములు గాఁ జాలవు.

సమాప్తము.



జ్ఞానోదయ గ్రంథమాల,

మచిలీపట్టణము.

ఆంధ్రమహాజనులారా! దేశీయసోదరులారా!

ప్రపంచ మందలి సమస్తవిషయముల యెడలను జ్ఞానము నభివృద్ధి నందింపఁజేసిననేగాని యే భాషయుఁ బరిపూర్ణత్వము నంద నేరదు. ఈ భాషాపరిపూర్ణత్వము నంద యత్నింపని జాతి యెల్లప్పుడు నధోగతి ననుసరించియే యుండును. పరాసుదేశముయొక్క నాగరికతయు, జర్మనీదేశముయొక్క యౌన్నత్యమును, జపానుదేశముయొక్క విజృంభణమును, ఇంగ్లాండు దేశముయొక్క దివ్యైశ్వర్యమును, ఆయాదేశములయందలి భాషాభివృద్ధివలననే వెలుగొందుచున్న వని మనము తెలిసికొనవలయును. భరతవర్షమునం దైనను బంగాళీభాష యెట్టుల నభివృద్ధి నందియున్నదో చూడుఁడు! ఈ బంగాళీభాష, ప్రకృతిశాస్త్రములయందేగాని, చరిత్రలయందేగాని, నవలలయందేగాని, వార్తాపత్రికలయందేగాని, పాశ్చాత్యభాషలకు వెనుదీయని దినదినప్రవర్ధమానస్థితి నందుచున్నయది. ఆంధ్రభాషయు నాస్థితికి రావలయు నన్న మనము విశేషమగుపట్టుదలతోడను నుత్సాహముతోడను బనిసేయవలసియున్నది. ఆంధ్రులయందు విజ్ఞానమును వెదజల్ల నెంచిన కొన్నిమండలులును, కొన్నిభాషాసంఘములును గలవుగాని, వీరలుమాత్రమే భాషకు వలయు సంపూర్ణసేవను జేయఁగలుగుదు రనుట కలలోనివార్త! అట్టిసంఘములు నూరైనను విసువకుండ నొకయర్ధశతాబ్దము పనిచేసినను నాంగ్లేయభాషావాఙ్మయమునందలి శతాంశమునైనను బ్రమరింపఁజాలవు. ఇట్టిసందర్భమున మేమును గ్రంథమాలరూపమున స్వల్పధరల కందుబా

శీయునం బొందునటుల, ఆంధ్రుల కత్యంతోపయోగ మగునట్టియు, దేశజనుల యౌన్నత్యమును రంజింపఁ జేయునట్టియు, దేశాభిమానుల ఆదర్శములఁ బురిగొల్పునట్టియు, భాషాభిమానులభావములఁ బ్రకాశింపఁ జేయునట్టియు, గ్రంథముల వెలువరింపఁ జేయుటమూలమున మాస్వయంవిధిని నెరవేర్పఁబూనుకొని యున్నారము. ఇందులకై మాకు ఆంధ్రమహాజనులు తోడ్పడి తగు ప్రోత్సాహము నిచ్చుచు దేశోపయోగమగు గ్రంథముల నింకను బ్రకటించుటకు వలయు ధైర్యోత్సాహముల నొసంగుదు రని నమ్ముచున్నారము.

పద్ధతులు.

సంవత్సరమున కథమపక్షము మూఁడుగ్రంథముల నైనను వెలువరింతుము. శాశ్వతచందాదారులుగ నుండి మేము ప్రకటించు ప్రతిగ్రంథమును బుచ్చుకొన నియ్యకొనినవారలకు క్రవున్సైజు ప్రతినూఱుపుటలకు 4అణాలు చొ॥ వెలను నిర్ణయింతుము. మాయొద్ద నిదివఱకే సిద్ధమయియున్న గ్రంథములను గూడ నీక్రింది వివరముల ప్రకారము చందాదారులకుఁ దక్కువ వెలల కిత్తుము.

☞ ఇదివరలో మాయొద్ద నేదైన గ్రంథమునుగాని, గ్రంథములనుగాని, కొనియున్నయెడల నా సంగతిని మాకు దెలియఁబఱచినచో వారి నామములను మాయొద్ద లిస్టులో సరిచూచి కొదువ గ్రంథములను మాత్రమే మా గ్రంథమాలయొక్క చందాపద్ధతులప్రకారము తక్కువధరలకు బంపఁగలము.

చందాదారులుగఁ జేరుటలో మొదటిమూఁడు గ్రంథములలో నేగ్రంథమునుండి నైనను బ్రారంభింపవచ్చును. అయితే చందాదారులుగ నుండువారు, 1 వ గ్రంథమునుండి ప్రారంభించిన యెడల 1, 2, 3, 4, 5, 6 గ్రంథములను దీసికొని తీరవలయును. 2 వ గ్రంథమునుండి ప్రారంభించిన

యెడల 2, 3, 4, 5, 6, గ్రంథములను దీసికొని తీరవలయును; 3 వ గ్రంథము నుండి ప్రారంభించినయెడల 3, 4, 5, 6, గ్రంథములను దీసికొని తీరవలయును. ప్రవేశకట్నమక్కరలేదు. పోస్టుఖర్చులను బుస్తకములఁగొనువారే భరింపవలయును.

1. ఆంగ్లేయ వైద్యచింతామణి.

„వేయేల! ఈరోగ మారోగ మనక మనుష్యసామాన్యమునకు వచ్చురోగములు, అట్టిరోగముల యుత్పత్తులు, వాటి చికిత్సలు, నీ యాంధ్రవైద్య గ్రంథరాజ మందు విపులముగ వ్రాయఁబడినవి.” (ఆకాశవాణి పత్రిక)

ఇందు సర్వవిధములగు రోగముల గుణములును, క్రిములును, చికిత్సలును, ఆధునిక వైద్యశాస్త్రము ననుసరించి తెలుపఁబడినవి. ఇందువలన నాంగ్లేయవైద్యశాస్త్రము ఆంధ్రులకు కరతలామలకం బగును. బాలురకును దెలియఁదగు శైలిలో వ్రాయఁబడి యున్నది.

దీనివలని లాభములు.

స్వలాభము నా పొందవచ్చును! ధనమా సంపాదింపవచ్చును!! ప్రపంచమునకా మేలును జేయవచ్చును!! జనాదరణా నా బడయవచ్చును!! ఆంగ్లేయ వైద్యచింతామణిని జదువుటవలన నెన్నిలాభములో చూడుఁడు!

ఆంధ్రమహాజనులారా! మీ గృహమునందుగాని, మీకుటుంబమునందుగాని, మీ పట్టణమునందుగాని, ప్రాణాపదసమయమున జయప్రద

మగు వ్యాధిచికిత్స జేయుటచే మానవసేవఁ జేయుచు, జనాదరణను బడయఁ దలంచితిరేని ఆంగ్లేయవైద్యచింతామణిని జదువుఁడు!

ఆంధ్రదేశీయవైద్యులారా! మీ మీ వైద్యాభ్యాసములందు, నూతనాంశముల నెఱుంగుటచే వ్యాధిచికిత్సలయందు సులభమార్గముల నభ్యసించుచు, బహుసూక్ష్మ మగు శాస్త్రీయపద్ధతుల నవలంబించుటచే వ్యాధిని నిర్మూలము జేయుచు, మెప్పు వడసి, మిక్కుటమగు ధన మార్జించుచు, తరతరములకు ఖ్యాతిని సంపాదింపఁదలంచితిరేని, ఆంగ్లేయవైద్యచింతామణిని జదువుఁడు! ఇందలి రహస్యముల గ్రహింపుఁడు!!

ఆంధ్రవిదుషీమణులారా! మీకుటుంబము లందు దేహారోగ్యములను జక్కఁగఁ గాపాడి, వ్యాధులను బారఁద్రోలుటకు శక్తిని సంపాదించి, సౌఖ్యముగ నుండఁదలంచితిరేని ఆంగ్లేయవైద్యచింతామణిని జదువుఁడు!

"మీరు వి. పి. మార్గమునఁ బంపిన ఆంగ్లేయవైద్యచింతామణి నందియుంటి నని తెలియఁజేయుటకు సంతసించుచున్నాను. నాబంధువులయందీగ్రంథము వ్యాప్తనందఁ జేయ నిచ్ఛగలిగి యుంటినిగాన, మఱియొకప్రతిని వి. పి. గాఁ బంపఁగోరినాను." (Sd.) జె. మల్లపరాజు, సబ్ అసిస్టెంట్ సర్జన్, అడ్డతీగెల, గోదావరి యేజన్సీ.

పండితాభిప్రాయములు.

ఆయుర్వేదమార్తాండభిషఙ్మణి పండిత డి. గోపాలాచార్యులవారు:—"... ఇట్టి గ్రంథము సామాన్యవైద్యులకు మిగుల మేలుఁ జేయును. ప్రతికుటుంబమునను నుండఁదగినదని నొక్కి చెప్పఁగలను."

డాక్టరు ఆచంట లక్ష్మీపతి బి. ఏ. యం. బి. అండ్ సి. యమ్. గారు:—"ఆంగ్లేయవైద్యసారమును ప్రజలయెదుటఁ బెట్టి

మనదేశపు పత్రికల యాంధ్రకారమును బాపు గ్రంథములలో నిది మొదటిది యని చెప్పవచ్చును."

డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య బి. ఏ. యం. బి. అండ్ సి. యం. గారు:— "... గ్రంథకర్తగారెంతయు వ్యయప్రయాసములకోర్చి యీ గ్రంథపూర్వకముగ నాంగ్లేయ వైద్య శాస్త్రసారము నాంధ్రుల కందఁజేసి వారి కృతజ్ఞతకుఁ బాత్రులయిరి."

డాక్టరు డి. యస్. రామచంద్రరావు యం. ఏ. యం బి. సి యచ్. బి. గారు:— "...వైద్యేతరులు వ్యాధుల యొక్క సాధారణగతులయందు తమను, దమ కుటుంబములను, జికిత్స జేసికొనుటకై యీగ్రంథ ముపయోగింపఁ గలదు."

చందాదారులకు రు 2-0-0 ఇతరులకు రు 3-8-0

పోస్టుఖర్చులు 5 అణాలు.

---

2. శ్రీకృష్ణుని జీవితచారిత్రము.

క్రవును 330 పుటలు.

దేశబాంధవ్ లాలా లజపతిరాయ్ చే ఉర్దూ భాషయందు వ్రాయఁబడి, శ్రీయుత కోణకంచి చక్రధరరావుగారిచే నాంధ్రీకరింపఁ బడినది.

శ్రీకృష్ణుని యాదర్శ మద్వితీయము!

శ్రీకృష్ణుని వర్తన మనుకరణీయము!!
శ్రీకృష్ణుని జీవిత మత్యంతవర్ణనీయము!!!

దేశచరిత్రయందలి యిట్టి మహాపురుషుల జీవితముల బరిశీలనఁగఁ జది వినఁ నేగాని యేజాతియును నభివృద్ధి నంద నేరదు. 8 చిత్రపటములు గలవు. బహు రసవంతముగ వ్రాయఁబడినవి.

ఈ గ్రంథమును జదువునప్పుడు మేనఁ బులకలు వొడమునని చెప్పుట అతిశయోక్తి కా నేరదు. ఈ గ్రంథము ఉర్దూభాషయందు మూఁడుసారులు ముద్రితమై నాల్గవముద్రణమున కిపుడు సిద్ధముగ నున్నది. ఉర్దూభాషయం దింతవఱకు 30,000 ప్రతులైనను కర్చుపడి యుండవచ్చును. ఆంధ్రభాషయం దిదివఱ కిట్టి గ్రంథము వెలువడి యుండ లేదు.

చందాదారులకు రు 0-12-0 ఇతరులకు రు 1-4-0 పోస్టుఖర్చులు 3 అణాలు.

3. జపానీయము.

డెమి 100 పుటలు.

దేశభక్తిపూరిత మయిన దివ్యనాటకము.
జపానీయుల అద్భుతకృత్యములు బహురసవంతముగ
నిందు వ్యక్తీకరింపఁ బడినవి.

ప్రబంధములకంటె నవలలును, నవలలకంటె నాటకములును, సందర్భాంశముల నతిరమ్యముగఁ బ్రదర్శన మిచ్చునను నది నిర్వివాదాంశమయి యున్నది. ప్రపంచ మంతయు నొకేమారుగ దిగ్భ్రమ జెందునట్లు రుష్యా మహారాజ్యమును సంగరమున నోడించిన జపానువారి యుద్ధచరిత్రమును నాటకరూపమునఁ జదువ నుద్యుక్తుఁడుగ నుండని యే మానవుఁ డుండఁ గలఁడు!

ఇందు జపానీయుల దేశభక్తియు, జపానీయుల రాజభక్తియు, జపానీయుల స్వార్థత్యాగమును, పురుషులయందును స్త్రీలయందు నేగాక, బాలురయందును గూడ వెల్లువలయి పాఱుచుండును!

ఇట్టి నాటకము నాంధ్రులు చదివిన కెన్నఁడును జడవి యుండరని ధృఢముగఁ జెప్పగలము.

చందాదారులకు రు 0-6-0, ఇతరులకు రు 0.12.0 పోస్టుఖర్చులు 2 అణాలు

4. లుబ్ధమహాజనసభ.

క్రౌను 35 పుటలు.

హాస్యరసప్రధానములైనట్టియు, ఆర్థికశాస్త్రసంబంధమగునట్టియు, వేదాంతశాస్త్రసంబంధమగునట్టియు, సంశయములఁ జక్కఁగ జర్చించినట్టి యుపన్యాసములు; చదివితీరవలయును; బహు వినోదకరములు!

ఈ యుపన్యాసములలో వర్ణింపఁబడినఁ గొందఱు మహాపురుషులు పైబిరాళ్లవలె గనబడక మానరుగనుక నట్టివారెవరైనను దమగుణగణములకు సరిపోవు లుబ్ధుల గుణముల నిందుఁ గనఁగొనిన యెడలఁ గాకతాళీయముగ నెంచి గుమ్మడికాయల దొంగలవలెఁ బ్రవర్తింప కుందురు గాక!

చందాదారులకు రు 0-1-0 ఇతరులకు రు 0-2-0.

వ్యవసాయశాస్త్రము.

(క్రౌను 300 పుటలు).

[శ్రీయుత పి. వెంకయ్య యం. ఆర్. యే. యస్. గారిచే రచియింపఁబడినది.]

ఇందు కాయధాన్యములు, వస్త్రములకు పనికివచ్చు పైర్లు, చమురు గింజలు, పప్పుధాన్యములు, తోటపైర్లు, రంగుల కుపయోగించు పైర్లు, ఎరువులు, పశువ్యాధులు, వాని చికిత్సలు మొదలగువాని గురించి వివరముగా వ్రాయబడినది. కొన్ని విషయములలో యకరమునకు సంవత్సరమునకు రు 1000 లు వఱకును లాభము దీయుటకు మార్గము లిందు సూచింపబడి యున్నవి. వ్యవసాయముతో సంబంధ ముండిన ప్రతియాంధ్రుడును నీగ్రంథమును జదువదగి యున్నది,

(ఆంధ్రకేసరి 1—12—11.)

"వ్యవసాయవిషయమును గురించి యింత విపులముగా నున్నగ్రంథ మిదివఱ కెన్నండును నాంధ్రమునఁ బ్రచురింపఁబడి యుండలేదు."

చందాదారులకు రు 0-12-0 ఇతరులకు రు 1-2-0 పోస్టేజి రు 0-3-0

6. మహాభారతసారము,

చందాదారులకు రు 0-14-0 ఇతరులకు రు 1-5-0 పోస్టేజి రు 0-4-0

7. మయూరాసనము. (25 పుటలు)

భారతభూమి యొకానొకప్పుడు వహించియున్న దివ్యతర మగు మహావైభవమును స్వప్నమునందువలెఁ గన్పింపఁజేయు మయూరాసనముం గూర్చిన యీచిన్నివ్యాసమును జదివి తీరవలయును.

చందాదారులకు రు 0-1-6 ఇతరులకు రు 0-2-0

వలయువారలు:—

మేనేజరు, జ్ఞానోదయ గ్రంథమాల, మచిలీపట్టణము.

లేక

సేతు బ్రదర్సు, మచిలీపట్టణము.